క్లుప్తంగా

కోనా వేంకటేశ్వరుడికి ప్రత్యేక పూజలు



స్వామివారికి పూజలు చేస్తున్న పూజారి

సి.బెళగల్: మండల పరిధిలోని క్రిష్ణదొడ్డి గ్రామ కొండపై వెలసిన కోనా వేంకటేశ్వర స్వామికి శనివారం ప్రత్యేక పూజలను నిర్వహించారు. స్వామివారికి ప్రియమైన రోజు కావడంతో భూదేవి, అలివేలిమంగమ్మ సమేత స్వామివారి మూలవిగ్రహాలకు అభిషేక పూజలతో పాటు ప్రత్యేక పుష్ప,పత్రాలతో అలంకరించి పూజా కార్యాక్రమాలను చేపట్టారు. స్థానిక గ్రామస్తులతో పాటు, సి.బెళగల్, బురాన్‌దొడ్డి, పుల్లకుర్తి, పోలకల్, ఇనగండ్ల గ్రామాలకు చెందిన భక్తులు కొండపైకి చేరి స్వామి వారికి పూజలను నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు అన్నదానం చేశారు.

మూల పెద్దమ్మ హుండీ ఆదాయం రూ.6.31 లక్షలు



హుండీ కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

గడివేముల: మండల కేంద్రంలోని మూల పెద్దమ్మ ఆలయానికి హుండీ కానుకల ద్వారా రూ.6,31,702 ఆదాయం వచ్చినట్లు ఈఓ రామ లింగేశ్వరరెడ్డి తెలిపారు. భక్తులు హుండీలో వేసిన కానుకలను శనివారం లెక్కించారు. ఏడు నెలల కాలానికి ఈ ఆదాయం వచ్చినట్లు ఈఓ వెల్లడించారు. పర్యవేక్షణాధికారి హరిచంద్ర రెడ్డి, సిబ్బంది సుబ్బయ్య, తిరుమల బాలాజీ సేవా సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేడు మద్యం షాపులు మూసివేత

కోడుమూరు రూరల్: గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని కోడుమూరు ఎక్సైజ్ పరిధిలోని 14 మద్యం దుకాణాలను ఆదివారం మూసివేస్తున్నట్లు ఎక్సైజ్ సీఐ మంజుల శనివారం తెలిపారు. సోమవారం తిరిగి తెరవడం జరుగుతుందన్నారు. నిబంధనలు అతిక్రమించి మద్యం విక్రయిస్తే కేసులు నమోదు చేయడంతో పాటు, లైసన్సులు రద్దు చేస్తామని సీఐ హెచ్చరించారు.

3 నుంచి జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు

కోడుమూరు రూరల్: శ్రీచౌడేశ్వరీదేవి తిరునాల సందర్భంగా ఫిబ్రవరి 3వ తేదీ నుంచి కోడుమూరు ఎస్ఆర్‌టీ మైదానంలో జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు దస్తగిరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రికెట్ పోటీల్లో గెలుపొందే జట్లకు మొదటి బహుమతిగా రూ.50వేలు, రెండో బహుమతిగా రూ.25వేలు అందజేస్తామని చెప్పారు. ఆసక్తి గల క్రీడాకారులు 8886769130 నంబర్‌కు సంప్రదించి తమ జట్టు పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

కోడుమూరు రూరల్: కోడుమూరులో శుక్రవారం రాత్రి ఘర్షణకు పాల్పడ్డ ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు శనివారం తెలిపారు. ఓ వర్గానికి చెందిన ఎరుకలి సుధాకర్ ఫిర్యాదు మేరకు ఎరుకలి వీరేంద్ర, రవి, ఉసేన్‌తో పాటు మరో ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేయగా, మరో వర్గానికి చెందిన ఉసేన్ బాషా ఫిర్యాదు మేరకు రాజశేఖర్, సుధాకర్, చోటు అనే వ్యక్తులతో పాటు మరో ఇద్దరిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు వెల్లడించారు. కాగా ఏవైనా సమస్యలుంటే పోలీసుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని, ఘర్షణలకు దిగి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

మద్దతు ధరతో కందుల కొనుగోలు

కోడుమూరు రూరల్: ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండించిన కందులను క్వింటాల్ రూ.7,550 మద్దతు ధరతో ఈనెల 27వ తేదీ నుంచి రైతు సేవా కేంద్రాల్లో కొనుగోలు చేస్తున్నట్లు ఏఓ రవిప్రకాష్ శనివారం తెలిపారు. కంది పంట సాగు చేసి, పంట నమోదు చేయించుకున్న రైతుల నుంచి గరిష్టంగా 100 క్వింటాళ్ల వరకు కందులను కొనుగోలు చేస్తామని తెలిపారు. కందులు అమ్ముకోవాలనుకునే రైతులు ఆధార్, బ్యాంకు పట్టాదారు పాసు పుస్తకాల వివరాలతో ఆయా రైతు సేవా కేంద్రాల్లో పేర్లు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఏఓ సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఓర్వకల్లు: మండలంలోని కాల్వబుగ్గ బాలుర గురుకుల పాఠశాలలో కాంట్రాక్టు పద్ధతిన వంట మనుషుల నియామకం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పి. ప్రసాద్‌రావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో వంటపని, స్వీపర్ పని చేసేందుకు ఆసక్తి ఉన్న వారు ఈ నెల 27వ తేదీ నిర్వహించే ఇంటర్వ్యూకు హాజరుకావాలన్నారు.




కల్లూరు: మండల పరిషత్ కార్యాలయంలో సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంపీడీఓ, సి.బెళగల్‌లో..



ర్యాలీలో శాంతిరామ్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు



గూడూరులో మాట్లాడుతున్న ఆర్డీఓ సందీప్‌కుమార్

ఓటుతోనే ప్రజాస్వామ్యానికి మనుగడ

ఘనంగా జాతీయ ఓటరు దినోత్సవం

కల్లూరు: ఓటుతోనే ప్రజాస్వామ్యానికి మనుగడ అని తహసీల్దార్ ఆంజనేయులు, ఎంపీడీఓ నాగేశ్వరెడ్డి అన్నారు. శనివారం జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా తహసీల్దార్ కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదన్నారు. గ్రామాల్లో బీఎల్ఓలు ఓటరు నమోదుపై అవగాహన కల్పించాలన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొందాలన్నారు.

ఓటు హక్కు ఎంతో విలువైంది

కోడుమూరు రూరల్: రాజ్యాంగం ప్రసాదించిన హక్కుల్లో ఓటు హక్కు ఎంతో విలువైందని కర్నూలు ఆర్డీఓ సందీప్‌కుమార్ అన్నారు. గూడూరులో తహసీల్దార్ రామాంజినేయులు ఆధ్వర్యంలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించారు.



పాణ్యం: మాట్లాడుతున్న తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి

ముఖ్య అతిథిగా ఆర్డీఓ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని పేర్కొన్నారు. ప్రతి పౌరుడు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. యువత చేతుల్లోనే దేశ భవిష్యత్ ఉంటుందన్నారు. అనంతరం విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ నాగరాజు, డీటీ ధనుంజయరెడ్డి, రీసర్వే లోకేశ్వరరెడ్డి, ప్రిన్సిపాల్ రమణ, ఆర్ఐ వరలక్ష్మి, బీఎల్వోలు పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

పాణ్యం: ఓటు హక్కు పొందిన ప్రతి ఒక్కరూ ఓటు వేసి ప్రజాస్వామ్యాన్ని గెలిపించాలని తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. మంచి నాయకుడిని ఎన్నుకునే అవకాశం ఓటుతోనే ఉంటుందని తెలిపారు. ప్రలోభాలకు లోను కాకుండా దేశాభివృద్ధికి ఓటుతో బాటలు వేయాలన్నారు. అనంతరం పాణ్యంలోని సీనియర్ ఓటర్లు నాగలక్ష్మయ్య, వీరరాఘవరెడ్డిలను సన్మానించారు. నూతన ఓటర్ల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. మహేష్‌బాబు, విశ్వవాణి, పద్మభూషణమ్మ, ప్రవీణ్‌కుమార్‌లకు ఉత్తమ బీఎల్‌ఓలుగా అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో డీటీ శివశంకర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు రంగారమేష్ పాల్గొన్నారు. అలాగే నెరవాడమెట్ట వద్ద ఉన్న శాంతిరామ్ ఇంజినీరింగ్‌లో ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం ఆధ్వర్యంలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.



కల్లూరు: ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ ఆంజనేయులు

పౌరుల బాధ్యత

సి.బెళగల్: ఎన్నికల్లో ఓటు వేయడం పౌరుల బాధ్యత అని ఇన్‌చార్జ్ తహసీల్దార్ పురుషోత్తం అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్, ఎంఈఓలు జ్యోతి, ఆదామ్‌బాషా మాట్లాడారు. అనంతరం అధికారులు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి స్థానిక బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్‌లో మానవహారంగా ఏర్పడి ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా అధికారులు ఓటు హక్కు విశిష్టత, అవసరాన్ని, పరిపాలన విధానాలను వివరించారు. ప్రజలకు ఓటు వినియోగం, అవసరాలను తెలియజేశారు. భారత పౌరులకు రాజ్యాంగం ద్వారా ఓటుహక్కు కల్పించడం జరిగిందని, ఓటు హక్కుతో సుపరిపాలన, అభివృద్ధి అంశాలు ముడిపడి ఉంటాయన్నారు. కార్యక్రమంలో రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వర్లు, మండల పరిషత్ కార్యాలయ ఏఓ శ్రీనివాసులు, వీఆర్వోలు రఫీ, శ్రీనివాసులు, శేఖర్, సచివాలయ ఉద్యోగులు, బీఎల్వోలు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డితో పార్టీ నేతలు

● కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడానికి పదవులు పొందిన వారందరూ కృషి చేయాలని ఆ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. పాణ్యం నియోజకవర్గం అనుబంధ విభాగాల అధ్యక్షులుగా నియమితులైన కేవీ రమణారెడ్డి, దుర్గా ప్రసాద్, ఎం.వి.సాయికృష్ణ శనివారం కాటసాని రాంభూపాల్‌రెడ్డి, కాటసాని శివనరసింహారెడ్డిని స్వగృహంలో మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా కాటసాని రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతూ.. పదవులు పొందిన వారందరూ నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. గ్రామాల్లో కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏకాగ్రతతో చదివితే విజయం సొంతం

కల్లూరు: విద్యార్థులు తరగతులు ప్రారంభం నుంచే ఏకాగ్రతతో కష్టపడి చదివితే విజయం సొంతమవుతుందని డాక్టర్ బోరెల్లి హర్ష అన్నారు. శనివారం కల్లూరు అర్బన్ పరిధి పెద్దపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో '' విద్యార్థులు విజయం వైపు పయనిద్దాం'' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమెతో పాటు జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు సుధీర్‌రాజు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మూఢనమ్మకాలను నమ్మవద్దని, విజ్ఞానశాస్త్రంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వేణుగోపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విజ్ఞానశాస్త్రంపై విద్యార్థులకు అవగాహన

పర్యావరణపై అవగాహన అవసరం

● నేషనల్ గ్రీన్ కోర్ రాష్ట్ర డైరెక్టర్ స్రవంతి

ఓర్వకల్లు: విద్యార్థులు విద్యార్థి దశ నుంచే పర్యావరణంపై అవగాహన కలిగి వుండాలని నేషనల్ గ్రీన్ కోర్ రాష్ట్ర డైరెక్టర్ స్రవంతి అన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా శనివారం మండలంలోని నన్నూరు సమీపంలో గల బిర్లా ఓపెన్ మైండ్ స్కూల్‌ను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ స్రవంతి మాట్లాడుతూ, విద్యార్థులు పాఠశాల దశ నుంచే పర్యావరణపై అవగాహన పెంచుకోవడం వల్ల భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణం అందించగల వారమవుతామని అభిప్రాయపడ్డారు. జిల్లా సమన్వకర్త ఆకుల రాజశేఖర్ మాట్లాడుతూ, ఎకో హకతాన్ థీమ్ గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు ఆఫీసర్ సత్యనారాయణ, ఆంధ్రప్రదేశ్ నేషనల్ గ్రీన్ కోర్ కోఆర్డినేటర్ మద్దిలేటి కిరణ్, ప్రసాద్, పాఠశాల పరిపాలనాధికారి మల్లిఖార్జున, ప్రిన్సిపాల్, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులతో నేషనల్ గ్రీన్‌కోర్ రాష్ట్ర డైరెక్టర్ స్రవంతి, తదితరులు

సంపద కేంద్ర నిర్మాణ పనులు ప్రారంభం

సి.బెళగల్: మండల పరిధిలోని పోలకల్ గ్రామంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం నిర్మాణ పనులు శనివారం ప్రారంభం అయ్యాయి. ఎస్సీ కాలనీ సమీపంలోని మంచినీటి బావి వద్ద పది సెంట్ల స్థలంలో సంపద తయారీ కేంద్రం నిర్మాణ పనులు మొదలయ్యాయి. పంచాయతీ కార్యదర్శి సునీల్‌రాణితో కలిసి ఎంపీడీఓ రాణెమ్మ, ఈఓఆర్డీ ఈశ్వరయ్యస్వామి పనులను పర్యవేక్షించారు. సంపద కేంద్ర నిర్మాణ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేసి గ్రామంలోని చెత్తను సంపద కేంద్రానికి తరలిస్తామని తెలిపారు. వాటితో ఎరువు తయారు చేసి రైతులకు విక్రయించడం ద్వారా పంచాయతీకి ఆదాయం వస్తుందన్నారు.



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ, ఈఓఆర్డీ

సమయపాలన పాటించకుంటే చర్యలు

గడివేముల: గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు సమయపాలన పాటించకుంటే చట్టపరమైన చర్యలు తప్పవని ఎంపీడీఓ వాసు దేవ గుప్తా హెచ్చరించారు. శనివారం మండల పరిధిలోని గడిగరేవుల సచివాలయాన్ని తనిఖీ చేశారు. సచివాలయం పరిసర ప్రాంతాలను పరిశీలించి పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలన్నారు. ప్రతి సోమవారం వచ్చే అర్జీలపై నిర్లక్ష్యం వహించకుండా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. గ్రామాల్లో నిరంతరం పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈఓపీఆర్డీ మహీధర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి బాషా తదితరులు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

పశువుల మేతనూ వదల్లేదు..!

● హెచ్చుమీరుతున్న టీడీపీ నేతల ఆగడాలు
● పశువుల మేత భూమిని అమ్మిన వైనం
● ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంపై గ్రామస్తుల ఆగ్రహం
● గ్రామంలో పోలీసు బందోబస్తు



గ్రామంలో పోలీసు పహారా



న్యాయం చేయాలని కోరుతున్న గ్రామస్తులు

గడివేముల: టీడీపీ నాయకుల ఆగడాలు రోజురోజుకు శృతి మించుతున్నాయి. మొన్న పచ్చని పంటకు నిప్పు పెట్టారు. నేడు మూగ జీవాల (పశువుల) కడుపు కొడుతున్నారు. దోచుకునేందుకు కాదేది అనర్హం అన్నట్లు కూటమి నేతలు ఏకంగా పశువుల కోసం గ్రామంలో ఉన్న భూమిని అమ్ముకుని పశువులకు ఆహారం లేకుండా చేస్తున్న ఘటన గ్రామస్తులను ఆవేదనకు గురిచేస్తోంది. గడివేముల మండలం కె.బొల్లవరం గ్రామస్తులు విసిగిపోయి శనివారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, రైతులు మాట్లాడుతూ.. తమ గ్రామంలో పాడి పశువుపై ఆధారపడి జీవనం సాగించే కుటుంబాలు అధికంగా ఉన్నాయన్నారు.

పాడి రైతుల ఆవేదన

గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు దాష్టికం అంత ఇంతా కాదన్నారు. గ్రామంలో పశువులకు పశుగ్రాసం కోసం ఉన్న స్థలాన్ని అమ్ముకుని సొమ్ము చేసుకున్న ఘనులు అని వాపోయారు. దీంతో గ్రామంలో పశువులకు మేత లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆరోపించారు. భూమి విక్రయించడం వల్ల ఇతర గ్రామాలకు చెందిన పాడి రైతులు అక్కడ పశువుల మేత కోసం వస్తున్నారని..ఎన్నో ఏళ్లుగా తమ గ్రామానికే సొంతమైన భూమిలో ఇతరులు రావడం భావ్యం కాదని వాపోయారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు. ఇలాగే జరిగితే వలస వెళ్లాల్సిన పరిస్థితి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.

పశువుల మేతను అమ్ముకున్నారు



గ్రామానికి చెందిన పశువుల మేత కోసం ఉన్న పొలాన్ని గ్రామ టీడీపీ నాయకులు రూ .లక్షలకు అమ్మేసుకుని తమ గ్రామ పశువులకు మేత లేకుండా చేస్తున్నారు. పశువులకు మేత లేకుండా చేస్తున్న వారిపై చర్యలు తీసుకుని పాడి రైతులకు న్యాయం చేయాలి. కూటమి ప్రభుత్వం వచ్చాక దౌర్జన్యాలు పెరిగిపోయాయి. పోలీసులు, ప్రభుత్వ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు.

–ఎల్లంపల్లి రాంభూపాల్ రెడ్డి, బొల్లవరం

పోలీసుల సహకారంతోనే...



50 ఏళ్ల నుంచి ఎన్నడూ లేని విధంగా గ్రామంలో ఈ రోజు చూస్తున్నాను. మా ఊరి పొలంలో పశువులను మేపుకునేందుకు అవకాశం లేకుండా చేస్తున్నారు. దౌర్జన్యంగా ఇతర గ్రామాల పశువులను మేపుతున్నారు. ఇందుకు పోలీసుల సహకారం ఉంది. ఉన్నత స్థాయి అధికారులకు ఫిర్యాదు చేస్తాం.

– విజయ బాబు రెడ్డి, మాజీ సర్పంచ్

మాకే హక్కు ఉంది



మాది కొండ ప్రాంతం కావడంతో పశువులు ఎక్కువగా ఉన్నాయి. మా ఊరి పొలాల్లోని మేతను వేరే గ్రామానికి అమ్మడం మంచి పద్ధతి కాదు. మా గ్రామంలోని పశువులకు దక్కేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. రైతులకు గ్రామస్తులకు ఆమోదయోగ్యం లేని నిర్ణయాలు తీసుకోవడం మంచిది కాదు.

– బత్తుల ఎల్లా సుబ్బారెడ్డి, రైతు, బొల్లవరం

రైతులకు పరిహారం అందజేయాలి



మాట్లాడుతున్న రైల్వే కోచ్ ఫ్యాక్టరీ భూబాధితులు

కర్నూలు(రూరల్): రైల్వే కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతులకు పరిహారం అందజేసి ఆదుకోవాలని పంచలింగాల, ఈ.తాండ్రపాడు గ్రామాల రైతు పోరాట సమితి నాయకులు డిమాండ్ చేశారు. శనివారం కర్నూలు వినాయక ఘాట్‌లోని వరసిద్ధి వినాయక మందిరంలో రైతులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైల్వే కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణానికి కేంద్రం 2015లో పంచలింగాల, ఇ.తాండ్రపాడు గ్రామాల్లో సుమారు 119 ఎకరాలు సేకరించిందని తెలిపారు. ఎకరాకు రూ.6,17,326 చెల్లించి భూములను స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. అప్పుడు ఎంపీగా ఉన్న కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి ఫ్యాక్టరీ వస్తే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని.. పిల్లలకు ఉద్యోగాలు లభిస్తాయని చెప్పి తమను ఒప్పించారన్నారు. అయితే పరిహారం సరిపోలేదని.. మార్కెట్ విలువ ప్రకారం నష్టపరిహారం అందజేయాలని జిల్లా సివిల్ కోర్టుకు వెళ్లగా రూ.38,72,000 ఇవ్వాలని 2019లో కోర్టు తీర్పు చెప్పిందన్నారు. తీర్పుపై ప్రభుత్వం హైకోర్టులో అప్పీలు చేయగా 2022లో మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిందని చెప్పారు. పరిహారం అందజేసి రైతులను ఆదుకోవాలని కోరారు. సీనియర్ న్యాయవాదులు కపిలేశ్వరయ్య, పి.సుంకన్న, రైతు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

హత్యారాజకీయాలను అరికట్టాలి




ఓర్వకల్లు: ఎంపీడీఓ శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేస్తున్న ఉపాధి సిబ్బంది, సి.బెళగలల్‌లో..

ఓర్వకల్లు: జాతీయ ఉపాధి హామీ పథకంలో హత్యారాజకీయాలను అరికట్టాలని ఎంపీడీఓ శ్రీనివాసులు అన్నారు. ఆలూరు మండలం, అరికెర గ్రామ ఫీల్డు అసిస్టెంట్ ఈరయ్య హత్యను ఖండిస్తూ శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట ఉపాధి సిబ్బంది నిరసన వ్యక్తం చేశారు. ఏపీఓ కుమార్ సాయినాథ్ ఆధ్వర్యంలో నిందితులను శిక్షించాలని కోరుతూ ఎంపీడీఓ శ్రీనివాసులుకు వినతి పత్రం సమర్పించారు. జిల్లాలో తరచూ ఫీల్డు అసిస్టెంట్‌లపై దాడులు, హత్యాయత్నాలు జరగడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృమైతే భవిష్యత్‌లో ఈ పథకంలో ఎవరూ పనిచేయలేని పరిస్థితి నెలకొంటుందన్నారు.

ఉపాధి సిబ్బంది నిరసన

కర్నూలు (రూరల్): ఫీల్డ్ అసిస్టెంట్ ఈరన్న హత్యకు నిరసనగా ఉపాధి సిబ్బంది కర్నూలు ఎంపీడీఓ కార్యాలయం వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి ఆందోళన చేశారు. నిందితులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. ఉపాధి సిబ్బంది మనోహర్ రెడ్డి, ఏపీఓ మధుబాబు, ఫీల్డ్ అసిస్టెంట్లు రాజేంద్రగౌడ్, ఖాసిం, రంగాస్వామి, స్వామిరావ్, మద్దిలేటి పాల్గొన్నారు.

సి.బెళగల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఏపీఓ రామన్న ఆధ్వర్యంలో మౌనం పాటించి మృతుడికి నివాళులర్పించారు. అనంతరం ఎంపీడీఓ రాణెమ్మకు వినతిపత్రం అందజేశారు.

నియామక పత్రాల అందజేత



నియామక పత్రం అందిస్తున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

కల్లూరు: పట్టణంలోని నంద్యాల చెక్‌పోస్టు వద్దనున్న దేవి ఫంక్షన్ హాల్‌లో శనివారం జాబ్‌మేళా నిర్వహించారు. అమర్ రాజా కంపెనీ, మెడ్‌ప్లస్ ఫార్మా కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థులను ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఆయా కంపెనీలకు ఎంపికైన వారికి ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, గౌరు వెంకటరెడ్డి దంపతులు నియామక పత్రాలు అందజేశారు.